నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 20 ఆగస్టు 2024 | RANGAREDDY




## రక్షా బంధనం.. ఊరూరా సంబురం



ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నదమ్ముళ్లకు అక్కలు, చెల్లెళ్లు రాఖీలు కట్టి అప్యాయత, అనుబంధాన్ని పంచుకున్నారు. నోటిని తీపి చేసి ప్రేమాభిమానాలను చూపారు. అక్కా చెల్లెళ్లకు కానుకలు ఇచ్చి మేమున్నామంటూ అన్నదమ్ములు భరోసానిచ్చారు. రాఖీ పండుగ సందర్భంగా ఏ ఇల్లు చూసినా బంధువులతో కళ కళ లాడింది.

## ప్రజావాణి..అధికారులేరీ?

### ప్రజావాణికి కొందరు అధికారుల డుమ్మా

**గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న జనం**

**ప్రజావాణిని లైట్‌గా తీసుకుంటున్న అధికారులు, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు**

పెద్దేముల్, ఆగస్టు 19 : ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి కొందరు అధికారులు డుమ్మా కొట్టారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ అందుకు భిన్నంగా మండలంలో ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టి పూర్తిగా కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రజావాణిని లైట్‌గా తీసుకొంటున్నారు. ముఖ్యంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్ సింగ్, తహసీల్దార్ కే కిషన్, ఏఈవో వినయ్ కుమార్‌లు హాజరు కాగా, మిగతా అధికారులు ఏపీవో, ఏపీఎం, విద్యుత్తు ఏఈ, ఫారెస్ట్ అధికారులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, ఆయా శాఖల ఏఈలు, ఇతర అధికారులు అందరూ డుమ్మా కొట్టారు. ఒకవైపు ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజల సమస్యలను తీర్చాలని చెబుతుంటే అధికారులు మాత్రం అవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మండలవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల నుంచి పనులు మానుకుని మా సమస్యలు చెప్పుకుందామని వస్తే అధికారులు లేరని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణికి హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పెద్దేముల్ మండలంలోని ప్రజావాణిలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

రూ.2 లక్షల రుణ మాఫీ రైతులకు గుదిబండగా మారింది. 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది..' అన్న చందంలా ఉన్నది.. రూ.2లక్షల వరకే మాఫీ వర్తిస్తున్నందున.. ఆపైన ఉన్న రుణాన్ని చెల్లిస్తేనే మాఫీ అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. దీంతో రూ.2లక్షలకు మించి రుణాలు ఉన్న రైతులు అప్పుల బాట పడుతున్నారు. సాగు పెట్టుబడికే అప్పులు దొరకక చస్తుంటే.. మళ్లీ తీసుకున్న రుణం చెల్లించేందుకు అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొస్తున్న జిల్లా రైతాంగం అప్పులు ఊబిలోకి కూరుకుపోతున్నది. ఇదేమి రుణమాఫీ దేవుడా అంటూ రైతాంగం ఆవేదనకు గురవుతున్నది.

- రంగారెడ్డి, ఆగస్టు 19
(నమస్తే తెలంగాణ)

- రూ.2లక్షల పైన రుణం ఉన్న వారికి నిబంధనల లంకె
- అదనంగా ఉన్న అప్పుచెల్లిస్తేనే రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపు
- సర్కారు రూల్‌తో మాఫీ కోసం మరోసారి అప్పు చేయాల్సిన దుస్థితి
- పెట్టుబడుల వేళ.. అధిక వడ్డీల భారం





# రైతన్నల అప్పు బాట

**జిల్లాలో రూ.2లక్షల రుణమాఫీ మండలాల వారీగా..**

| మండలం | ఖాతాలు | రుణమాఫీ |
|---|---|---|
| అబ్దుల్లాపూర్ మెట్ | 64 | రూ.80,10,781 |
| ఆమనగల్లు | 1,566 | రూ.18,90,83,574 |
| బాలాపూర్ | 02 | రూ.2,69,966 |
| చేవెళ్ల | 1,241 | రూ.14,36,83,411 |
| చౌదరిగూడెం | 354 | రూ.4,63,12,609 |
| ఫరూఖ్ నగర్ | 2,112 | రూ.25,87,00,748 |
| హయత్ నగర్ | 25 | రూ.29,73,801 |
| ఇబ్రహీంపట్నం | 792 | రూ.8,75,33,678 |
| కడ్తాల్ | 803 | రూ.10,14,42,983 |
| కందుకూరు | 782 | రూ.10,30,88,640 |
| కేశంపేట | 748 | రూ.8,85,96,898 |
| కొందుర్గు | 518 | రూ.7,19,38,691 |
| కొత్తూరు | 376 | రూ.4,61,88,936 |
| మాడ్గుల | 1,258 | రూ.13,65,48,554 |
| మహేశ్వరం | 528 | రూ.6,62,90,051 |
| మంచాల | 664 | రూ.8,13,47,844 |
| మొయినాబాద్ | 380 | రూ.5,09,65,038 |
| నందిగామ | 143 | రూ.1,73,85,350 |
| షాబాద్ | 410 | రూ.5,20,61,175 |
| శంషాబాద్ | 199 | రూ.2,40,08,791 |
| శంకర్‌పల్లి | 831 | రూ.10,80,49,825 |
| తలకొండపల్లి | 784 | రూ.8,77,34,342 |
| యాచారం | 646 | రూ.8,18,07,398 |
| మొత్తం | 15,226 | రూ.185,40,23,084 |

### అదనపు మొత్తం కట్టేదెలా..!

ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.2లక్షలు రుణమాఫీ అమలు చేస్తారని ఆశించిన రైతులకు భంగపాటే ఎదురైంది. ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. బ్యాంకుల్లో ఎంత రుణం ఉన్నప్పటికీ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీని అమలు చేస్తే.. వెసులుబాటు ఉన్న సమయంలో మిగిలిన మొత్తాన్ని చెల్లించి రుణ విముక్తులు అయ్యేవారమని రైతులు పేర్కొంటున్నారు. రూ.2లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని నిబంధన విధించడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అదనపు మొత్తాన్ని చెల్లించేందుకు రైతులు వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం పెట్టుబడులకే చేతిలో డబ్బులు లేక అవస్థలు పడుతున్న రైతులకు అధిక వడ్డీకి మరో మారు అప్పు చేయాల్సి వస్తున్నది. ఇదిలా ఉండగా.. బ్యాంకులు ఇప్పటి వరకు రుణమాఫీ అయిన రైతులకు వానకాలం పంట రుణాలు ఇస్తున్నాయి. కానీ మాఫీ జరుగని రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. దీంతో వ్యవసాయ సీజన్‌లో రుణాలు దొరకక వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నదని అన్నదాతలు వాపోతున్నారు. రుణమాఫీతో ప్రభుత్వ గ్రాఫ్ పెరుగకపోగా.. తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. రుణమాఫీ ప్రభుత్వానికి నష్టదాయకమే తప్ప ఏ మాత్రం లబ్ధి చేకూర్చేలా లేదని గ్రామాల్లోని కాంగ్రెస్ శ్రేణులు బాహాటంగానే అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు.

### తలపట్టుకుంటున్న అధికారులు..

రుణమాఫీ కాని రైతులు నిత్యం బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదులు సైతం పెద్ద ఎత్తున అధికారులకు అందుతున్నాయి. మండలాల వారీగా ఫిర్యాదుల నమోదు, పరిష్కారానికి ప్రత్యేక అధికారులను జిల్లా వ్యవసాయ శాఖ నియమించింది. ఇప్పటి వరకు చేసిన ఫిర్యాదులకు పరిష్కారం లభించకపోవడంతో మళ్లీ ఫిర్యాదు చేసినా ఏం ప్రయోజనమని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వద్దకు వెళ్తే.. ఏదో ఒకటి చెప్పి వెనక్కి పంపించి వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ఓ వైపు.. రైతుల నుంచి వస్తున్న ఒత్తిడి మరో వైపు.. ఏం చేయాలో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రైతులకు రుణమాఫీ జరుగకపోవడానికి కారణమేంటో? ఏ ప్రాతిపదికన అర్హులను నిర్ధారించారో! ఏ ప్రామాణికంగా అనర్హులను తేల్చారో? తమకు కూడా అంతుపట్టడం లేదని వారు పేర్కొంటున్నారు.

### పైడబ్బులు కడితేనే మాఫీ అంటున్నరు..



నాకు మూడు ఎకరాల పొలం ఉన్నది. కెనరా బ్యాంక్‌లో నేను, మా నాన్న హీర్యానాయక్ రుణం తీసుకున్నాం. వడ్డీతో కలిపి మొత్తం రూ.2.82 లక్షలు అయింది. రుణమాఫీ జాబితాలో మా ఇద్దరి పేర్లు ఉన్నాయి. మాఫీ అయ్యిందని సంతోషంగా బ్యాంక్‌కి వెళితే, రెండు లక్షలకు పైన ఉన్న డబ్బులు కడితేనే మాఫీ అవుతుందని అధికారులు కొర్రీలు పెడుతున్నారు. రైతులపై ప్రభుత్వం షరతులు విధించడం సబబు కాదు. కొత్తగా అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

– పాపానాయక్, పుల్లేరుబోడు తండా, కడ్తాల్ మండలం

### నయాపైసా మాఫీ కాలేదు..



ఎన్నికల్లో రైతుల కష్టాలు తీర్చుతం, అది చేస్తాం.. ఇది చేస్తామని గద్దెనెక్కి ఇప్పుడు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. ఒకే సారి అందరికీ పంట రుణ మాఫీ అని చెప్పి, కొందరికే మాఫీ చేసి చేతులు దులుపుకున్నది. మాఫీ చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం సున్నా. సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్‌కు బుద్ధి చెబుతాం. నాకు మూడు విడుతల్లోనూ నయాపైసా రుణం మాఫీ కాలేదు.

– అంజిరెడ్డి, కమ్మెట గ్రామం, చేవెళ్ల మండలం

## కొర్రీలపై కొంపల్లి వాసుల ఆగ్రహం



వికారాబాద్, ఆగస్టు 19 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రూ.2లక్షల్లోపు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక కొందరికే మాఫీ చేయడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామానికి 60 నుంచి 70 శాతం మేర మూడు విడుతల్లోనూ రుణ మాఫీ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు లింక్ పెట్టడం, రెన్యూవల్ చేసుకోకవడంతో పాటు ఏ కారణం లేకున్నా అర్హులైన వారికీ రుణమాఫీ కాలేదు. కొన్ని బ్యాంక్ అధికారులు, సిబ్బంది అర్హులైన రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపడం లేదని, రెన్యూవల్ చేసినా చేయనట్లు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.2లక్షల్లోపు రుణం తీసుకున్న చాలా మంది రైతులకు రుణ మాఫీ కాకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. రుణమాఫీ కాకపోవడానికి బ్యాంకు నుంచి తమకు ఎలాంటి సమాచారం రావడం లేదంటున్నారు. బ్యాంకుల చుట్టూ, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసినా తరువాత వస్తాయంటూ మాట దాట వేస్తున్నారని రైతులు దిగులు చెందుతున్నారు. అర్హులైన వారికీ మాఫీ ఎందుకు కాలేదో అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. వికారాబాద్‌లోని కొంపల్లిలో దాదాపుగా 400 మంది రైతులు ఉన్నారు. ఇందులో 350కి పైగా రైతులు వికారాబాద్‌లోని కెనరా బ్యాంక్‌తో పాటు ఆయా బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. దాదాపు 80 మంది రైతులకు రుణాలు మాఫీ కాగా.. 280 మంది రైతులకు మాఫీ కాలేదు. బ్యాంక్ అధికారులు అర్హులైన రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపకపోవడం వల్లే రుణ మాఫీ జాబితాలో పేరు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ కాని రైతులు గత కొన్ని రోజుల క్రితం వికారాబాద్ కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు.

### రూ.50వేల రుణ మాఫీ కాలె..



నాకు ఎకరం పొలం ఉన్నది. వికారాబాద్ పట్టణంలోని కెనరా బ్యాంక్‌లో రూ.50వేలు రుణం తీసుకున్నా. ఇప్పటి వరకు బ్యాంక్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. బ్యాంక్, వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లి అడుగగా, మరో విడుతలో వస్తాయంటూ మాట దాట వేస్తున్నారు. మా ఊరి రైతుల ఖాతాలు ఈ బ్యాంకులో చాలా ఉన్నాయి. కొద్ది మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యింది. బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యమో, ప్రభుత్వ వైఫల్యమో వారికే తెలియాలి. రైతుల గోసను ప్రభుత్వం పట్టించుకోవాలి.

– వెంకటయ్య, కొంపల్లి, వికారాబాద్

### కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నది...



నాకు 24 గుంటల భూమి ఉన్నది. వికారాబాద్ కెనరా బ్యాంక్‌లో రూ.34 వేల రుణం తీసుకున్నా. వెంట వెంటనే రెన్యూవల్ కూడా చేశా. ఎన్నికల్లో మాయ మాటలు చెప్పిన కాంగ్రెస్... రైతులను మోసం చేస్తున్నది. మూడు విడుతల్లోనూ రుణం మాఫీ కాలె. రోజూ బ్యాంకు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా. అర్హులైన రైతుల జాబితాను బ్యాంక్ అధికారులు ప్రభుత్వానికి పంపారా ? లేదా అనే అనుమానం వ్యక్తం అవుతున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– సంద నర్సింహులు, కొంపల్లి, వికారాబాద్

## మాఫీపై గౌతాపూర్ గరం.. గరం..



తాండూరు, ఆగస్టు 18 : రుణమాఫీపై కాంగ్రెస్ సర్కార్ తీరు అన్నదాతలకు ఆగ్రహం తెప్పిస్తున్నది. మొదటి నుంచి మూడో విడుత వరకు రైతులకు సరైన సమాచారం లేక, మాఫీ వివరాలు తెలియక అన్నదాతలు అమోమయానికి గురవుతున్నారు. అదిగో చేశాం.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడం తప్ప.. అర్హత ఉన్నా చేయలేదంటూ రైతులు భగ్గుమంటున్నారు. తాండూరు నియోజకవర్గంలో బ్యాంకుల్లో సగానికిపైగా రైతులకు రుణమాఫీ కాలేదు. ఏ పల్లెకెళ్లి రైతులను పలుకరించినా కాంగ్రెస్‌పై రైతులు నిప్పులు చెరుగుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో రైతులందరికీ మాఫీ చేసి న్యాయం చేశారని గుర్తు చేసుకుంటున్నారు. పలువురు అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేయడం కనిపించింది. తాండూరు మండలం గౌతాపూర్‌లో రుణమాఫీపై గందరగోళం నెలకొన్నది. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్ కేవలం రెండెకరాలే ఉండి రూ.90 వేలున్న మూడు విడుతలూ ముగిసినా రుణమాఫీ కాలేదని ప్రశాంత్ దేశ్‌పాండే ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో వందలాది మంది రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉన్నదన్నారు. పెద్దేముల్ మండలం బుద్దారంలో 242 మంది రైతులు మాఫీకి అర్హులు కాగా, ఇంకా రుణమాఫీ కాలేదని అనేక మంది రైతులు బోరుమంటున్నారు. రేగొండి వెంకటయ్యకు రూ.1.80 లక్షల రుణమాఫీ కావాల్సింది ఉండగా, ఎవరూ స్పందించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేస్తే మంచిదని, లేదంటే రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరిస్తున్నారు.

### కాంగ్రెస్ హామీలు జూటా మాటలే..



రూ.2 లక్షల వరకు ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో చెప్పిన రేవంత్‌రెడ్డి మాటలు జూటానే. మూడు విడుతలు ముగిసినా నాకు బ్యాంకులో ఉన్న రుణం రూ.90 వేలు మాఫీ కాలేదు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. రుణ మాఫీలో సరైన స్పష్టత లేక అనేక మంది రైతులు తికమక పడుతున్నారు. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న మాలాంటి వాళ్లకు ఇలా జరిగేతే ఎలా ? ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు రుణ మాఫీ కాని రైతులను సంప్రదించి వెంటనే రుణాలు మాఫీ చేయాలి.

– ప్రశాంత్ దేశ్పాండే, గౌతాపూర్

### ఎదురుచూపులే మిగిలాయి..



రుణమాఫీ కోసం ఆరునెలల నుంచి ఎదురుచూపులే మిగిలాయి. మూడు విడుతల్లోనూ రుణం మాఫీ కాలె. పెద్దేముల్ సొసైటీలో రూ.1.80 లక్షలు రుణం తీసుకున్నా. మూడో విడుతలో పేరు వస్తుందని ఆశతో ఎదురు చూశా. ఇంతవరకు రాకపోవడం బాధగా ఉన్నది. గత బీఆర్ఎస్ పాలనలో ఇలా జరుగలేదు. కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. రైతుల ఉసురుపోసుకున్న ఏ పార్టీ మనుగడ సాధించలేదు. ప్రజాపాలనంటూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

– రేగొండి వెంకటయ్య, బుద్దారం